క్లుప్తంగా

మాదాసి కుర్వ మండల కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మండల మాదాసి కుర్వలు ఆదివారం సమావేశమై మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మాదాసి కుర్వ జిల్లా అధ్యక్షుడు ఓరె నాగమల్లయ్య తెలిపారు. అధ్యక్షుడిగా బెట్టరి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కొల్లెఈశ్వర్, ఉపాధ్యక్షుడిగా బీరయ్య, కృష్ణయ్య, కోశాధికారిగా కొల్లెతిరుపతయ్య, కార్యదర్శిగా నాగమల్లయ్య, సహాయ కార్యదర్శిగా శారదమల్లేష్ వీరితోపాటు సభ్యులుగా బెల్లికృష్ణయ్య, వెంకటయ్య, మల్లయ్య, బెట్టరిరాజులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాదాసి కుర్వ జిల్లా నాయకులు బీరయ్య, చంద్రయ్య, కొల్లెతిరుపతయ్య, ఓరెవెంకటయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో భక్తుల ఇబ్బందులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ట్రాఫిక్ జామ్ కావడంతో బస్టాండ్ కూడలిలో మైసమ్మ జాతరకు వెళ్లే భక్తుల వాహనాలు నిలిచిపోయాయి. గంటపాటు అంతరాయం కలిగింది. రోడ్డుపైన వాహనాలను అడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు ఎంత నియంత్రించినా వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం బస్టాండ్ కూడలిలో జాతీయ రహదారి పనులు కొనసాగుతుండటంతో సమస్య మరింత జటిలమైంది. 10 వేల మంది భక్తులు మైసమ్మ దేవత దర్శించుకునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాల్వకు మరమ్మతు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ నుంచి యాదిరెడ్డిపల్లి వెళ్లడానికి ఆర్‌అండ్‌బీ రోడ్డు అనుసరించుకొని ఉన్న కాల్వను గ్రామానికి చెందిన రైతు బాల్‌రెడ్డి పూడ్చివేశారు. ఆదివారం గ్రామస్తులు పూడ్చిన కాల్వను పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను తొలగించిన రైతుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొమ్ము పర్వతాలు అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొంది గ్రామానికి వచ్చిన కొమ్ము పర్వతాలును ఆదివారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీపీ బండపర్వతాలు, బాలగౌడ్, జిలానీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



కల్వకుర్తిరూరల్: బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ రాష్ట్ర కార్యదర్శి సోమయ్య కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కమిటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, సత్యం, వహీద్‌ఖాన్, వెంకటయ్య, శివకుమార్, మధు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల మాస కల్యాణం



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవాలయంలో ఆదివారం సీతారాములు మాసకల్యాణం వేడుకగా కొనసాగింది. తిరుపతికి చెందిన రఘువరన్, భువనేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మాస కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిర్సనగండ్ల గ్రామస్తులు, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

కందనూలు: ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఐడీఓసీ భవనంలో రాష్ట్ర పభుత్వ ఉద్యోగస్తుల ఐక్య కార్యాచరణ వేదిక కార్యవర్గ సమావేశం జేఏసీ అధ్యక్షుడు బావండ్ల వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోపు ప్రభుత్వం ఉద్యోగస్తుల సమస్యల సాధన దిశగా అడుగులు వేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా సెక్రటరీ పి. రాజశేఖర్ రావు, సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్‌శర్మ, శ్రీధర్ రావు, షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్

- మౌలిక వసతులు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్టాండ్ బైక్‌లను పార్కు చేసిన ప్రయాణికులు

వెల్దండ: ప్రయాణికుల సౌకర్యం కోసం 26 ఏళ్ల కిందట వెల్దండలో బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ ఆవరణలో మౌలిక వసతులు లేక ఏళ్లుగా బస్టాండ్ నిరుపయోగంగానే ఉండిపోయింది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు నిర్వహిస్తున్నారు. హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో ప్రతి నిత్య ప్రయాణికులతో బస్టాండ్ వద్ద రద్దీగా ఉంటుంది. బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులకు ఆవరణలో కనీసం మౌలిక వసతులు తాగు నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా 1999వ సంవత్సరంలో అప్పటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి బి. గోపాల కృష్ణారెడ్డి, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఎస్. జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే యద్మ కిష్టారెడ్డిలు బస్టాండ్‌ను ప్రారంభించారు. దాదాపుగా 26 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. స్థానిక బస్టాండ్‌లో వసతులు లేక జాతీయ రహదారి కావడంతో వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న యాత్రికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు పట్టించుకొని బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు, రాజకీయ నాయకులు కోరుతున్నారు.

బైక్‌ల స్టాండ్‌గా మారిన వైనం

బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు వినియోగించుకోకపోవడంతో బైక్‌ల స్టాండ్‌గా మారింది. ప్రతి రోజు దాదాపుగా 50 బైక్‌ల వరకు ఆవరణలో ఉంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి పోతారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రత్యేకంగా బైక్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తే ఆర్టీకి ఆదాయం సమకూర్చుకోవచ్చని నాయకులు పేర్కొంటున్నారు. అదే విధంగా ఆవరణంలో స్టాల్, షాపులు నిర్మిస్తే ఆర్టీసీకి ఎంతో లాభం వస్తుందన్నారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయంతోను కనీసం మూత్రశాలలను కూడ వినియోగంలోకి తీసుకురాకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తునారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు వర్షకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలకు నీటి వసతిలేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగానే ఉండిపోయాయి. అధికారులు బస్టాండ్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి కనీసం నీటి వసతి కల్పిస్తే మూత్రశాలలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

వసతులు కల్పించాలి



బస్టాండ్ ఆవరణంలో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు వెల్దండకు చేరుకొని ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి బస్సులను బస్టాండ్ ఆవరణలోకి వెళ్లే విధంగా చూస్తే ప్రమాదాలను నివారించవచ్చు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

–జోగయ్య, ప్రయాణికుడు, వెల్దండ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వెల్దండ బస్టాండ్‌లో ఉన్న సమస్యలు వాస్తవమే. అనేక సార్లు బస్టాండ్‌ను పరిశీలించి నివేదికలను సిద్ధం చేశాం. ప్రయాణికుల విన్నపం మేరకు మౌలిక వసతులను కల్పించడానికి కృషి చేస్తున్నాం. బస్టాండ్ ఆవరణంలో పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. బస్టాండ్‌లో పనిచేసేందుకు మనుషులు రావడం లేదు. మూత్రశాలలను వినియోగంలో తీసుకురావడానికి కృషి చేస్తాం. బస్సులను బస్టాండ్‌లోకి వెళ్లె విధంగా చూస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి కృషి చేస్తాం.

–సుభాషిణి, డిపో మేనేజర్, కల్వకుర్తి

మల్లురవి క్షమాపణ చెప్పాలి



కొల్లాపూర్: కొల్లాపూర్ సభలో మాదాసి, మాదారి కురువ అయిన దండు నర్సింహను అవమానకరంగా మాట్లాడిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి క్షమాపణలు చెప్పాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. క్షమాపణలు చెప్పకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆసంఘ నాయకులు మల్లయ్య ,భీరయ్య, ధర్మయ్య, చంద్రయ్య, రాంబాబు, వెంకటస్వామి, బాలయ్య, దుబాయ్ స్వామి, తిరుపతయ్య, ఈశ్వర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

పోలీస్ బందోబస్తు

చారకొండ: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటన ముగించుకొని ఆదివారం ఉదయం తిరుగు ప్రయాణంలో కొల్లాపూర్ నుంచి రోడ్డు మార్గం ద్వారా చారకొండ మండలం మీదుగా ఖమ్మం జిల్లాకు బయలుదేరారు. ఉప ఎలాంటి ట్రాఫిక్, ఇతరత్ర సమస్యలు తలెత్తకుండా మండలంలోని దాదాపుగా 20 కి.మీ మేరకు వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, చారకొండ ఎస్ఐ శంషోద్దీన్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి వెంట ఉన్న గ్రామాల వద్ద, స్టేజీల వద్ద ప్రత్యేక పికెటింగ్ ఏర్పాటు చేశారు.

చెక్కు అందజేత



వెల్దండ: మండలంలోని గుండాల కోనేరులో మహాశివరాత్రి ఫిబ్రవరి 26న జేపీనగర్ కళాశాల విద్యార్థి పెరుమాళ్ల ఓమేష్ ప్రమాదవశాత్తు కోనేరులో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో విద్యార్థి తల్లిదండ్రులు పెరుమాళ్ల లక్ష్మి, రాములకు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అరుణ్, కమిటీ సభ్యులు అంజయ్య, లింగమయ్య, తిరుపతయ్య, ఆలయ అర్చకులు కృష్ణయ్యశర్మ, నరహరిశర్మ తదితరులు ఉన్నారు.


13న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శోభ ఆప్టికల్‌లో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి ఆదివారం ఒక ప్రటకనలో తెలిపారు. ఉచిత కంటివైద్య శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మహబూబ్‌నగర్‌లోని లయన్‌రాంరెడ్డి కంటి ఆస్పత్రికి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు. రోగులకు జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా రక్త పరీక్షలు, సాధారణ పరీక్షలు ఒకరోజు ముందుగానే చేయించుకుని శిబిరానికి హాజరుకావాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఓటరు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9440454284 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎంఏఎస్ఎస్ జెండా ఆవిష్కరణ

వెల్దండ: మండలంలోని చెదురుపల్లిలో ఆదివారం మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో జెండాను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ చైతన్యం కోసమే మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాలయ్య, కృష్ణయ్య, చంద్రయ్య, తిరుపతయ్యగౌడు, బాలయ్య, రాంకోఠి, మహేష్‌గౌడు, శివ, లక్ష్మణ్, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు



లింగాల: మండలంలో కొన్ని రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వానాకాలంలో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో సాగు చేసిన మొక్కజొన్న పంట వర్షాలు పడక పోవడంతో ఎండిపోతున్నాయని, నేల కూడా గట్టి బారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు ఉన్న వారు స్ప్రింక్లర్ల సహాయంలో పంటకు నీటిని పడుతుండగా, బోర్లు లేని రైతులు వరుణ దేవుడి కటాక్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. వర్షం పడితే పంటకు యూరియాను పెట్టవచ్చని రైతులు అంటున్నారు. మరి కొన్ని రోజులు పరిస్థితులు ఇలాగే ఉంటే తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా రహదారి నిర్మాణ పనులు



తాడూరు: కల్వకుర్తి నుంచి తాడూరు, కొల్లాపూర్ మీదుగా కర్నూల్‌కు వెళ్లేందుకు నిర్మిస్తున్న 167కే జాతీయ రహదారి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం నుంచి బైపాస్ నిర్మాణం అధికారులు చేపట్టారు. భూములు కోల్పోయిన రైతుల నుంచి ధ్రువపత్రాలు తీసుకోవడంతో పాటు కొంత మేర రైతులకు నష్టపరిహారాన్ని అందజేసినట్లు సంబంధిత కాంట్రాక్టర్ బాల్‌రెడ్డి తెలిపారు. నష్టపరిహారం అందజేసిన రైతుల పొలాల వరకు పనులు చేపట్టామని మిగతా రైతులకు నష్టపరిహారం చెల్లించి పనులు చేపడుతామని తెలిపారు.

కమిషనర్‌కు వినతి



కందనూలు: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ, ఎండబెట్ల, 17వ వార్డు సమస్యలు పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాగర్‌కర్నూల్ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పలు కాలనీలలో సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కనీస వసతులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు పస్తం బాబు, వారధి శీను, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



అచ్చంపేట రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం అచ్చంపేటలో పలు సంఘాలు, మిత్రమండలి సభ్యులు, పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్: స్నేహమనేది అజరామరం అని వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీ క్లబ్, వాసవీ వనితాక్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్, జగదీశ్వర్, శ్రీధర్, శ్రీనివాస్, రవి, అశోక్‌లు ఉన్నారు.

మూతపడిన పశువైద్య కేంద్రం



పెద్దకారుపాములలో వైద్యులు లేక మూతపడిన పశువైద్య శాల

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాములలో గ్రామీణ పశు వైద్య కేంద్రం వైద్యుడు, సిబ్బంది లేక మూతపడి నిరుపయోగంగా మారింది. గ్రామంలో పశువులు, గేదెలు, మేకలు రోగాలబారిన పడితే వైద్యం చేయించుకునేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. మూడేళ్ల కిందట ఈ పశువైద్య కేంద్రాన్ని రూ.10 లక్షలతో రూబన్ మిషన్ పథకం కింద నిర్మించారు. ఈ గ్రామీణ పశు వైద్య కేంద్రానికి వెటర్నరీ అసిస్టెంట్ నియమించాలని గ్రామ రైతులు కోరుతున్నారు. మండలంలో నాలుగు పశువైద్య కేంద్రాలకు సాతాపూర్, కల్వకోలు, వెన్నచర్ల పశువైద్య కేంద్రాలకు కూడా సిబ్బంది లేక ఆయా గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని పశువైద్య శాలలకు వైద్యులను, సిబ్బందిని నియమించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న బాబీదేవ్

తాడూరు: త్వరలో నిర్వహించే స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు కోరారు. ఆదివారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రపంచంలోనే 4వ ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుదర్శన్, సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్, నరేష్‌చారి, లక్ష్మన్‌గౌడ్, బాలస్వామి, కృష్ణ, అనంతరాములు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం

కల్వకుర్తిరూరల్: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాబిదేవ్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి 420 హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ నెల 6న ప్రభుత్వ హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి జాతీయ బీసీ కమిటీ మాజీ సభ్యుడు ఆచారి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, దుర్గాప్రసాద్, గుర్రాల రాంభూపాల్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నర్సింహ, విజయ్, చందుముదిరాజు తదితరులు హాజరయ్యారు.

ఇంటింటికీ బీజేపీ

మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని పట్టణంలోని గాంధీనగర్‌లో నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ నెల 6న చేపట్టే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రవీణ్‌కుమార్, వివేకనంద, నర్సింహ, శ్రీకాంత్, శివరామకృష్ణ, లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంట్లవెల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, మాజీ సర్పంచ్ తిరుపాటి నాగరాజులు అన్నారు. ఆదివారం మండలంలోని మల్లేశ్వరంలో దాదాపు 40 మందికి నూతన రేషన్‌కార్డులను వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు నియంతలా వ్యవహరించారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం రేషన్‌కార్డుల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, మాజీ సర్పంచ్ తిరుపాటి నాగరాజు, బాలరాజు, నర్సింహనాయుడు, కారంగి ఈశ్వరయ్య, డిష్‌రవి, కురుమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



తెలకపల్లి మండలం గౌరారంలో నగదు అందిస్తున్న మిత్రులు

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మంగళగిరి సతీష్‌కుమార్ తల్లి కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సతీష్‌కుమార్ మిత్రులు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో విడుదు శేఖర్, మహమూద్, మండల శేఖర్, గోపాల్, జహంగిర్, చిన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఆసిఫ్ ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందాడు. తోటి స్నేహితులు, 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. స్నేహితులు జమచేసిన రూ.32 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పిల్లల చదువులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మల్లేష్‌యాదవ్, మట్ట చంద్రకాంత్, కంగుల సాయిబాబు, పిల్లిశ్రీను ముదిరాజ్, కొండల్ ముదిరాజ్, ఆనంద్, వెంకటేష్, సద్దాం, సీహెచ్ మహేందర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని గంట్రావుపల్లికి చెందిన కటిక నాగేష్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నాగేష్‌కు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. వీరపాగ రామరాజు, కండక్టర్ ఖాజా, మచ్చ నాగేంద్రం, దూరెడ్డి నాగలింగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాజీ ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: దేవునితిరుమలాపూర్ గ్రామానికి చెందిన కేశంపేట శ్రీనివాసులు గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహలు ఆదివారం రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. కేశంపేట శ్రీనివాసులుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ ఉస్సెనయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఏసయ్య, మండల కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నర్సింహ్మా, లక్ష్మణస్వామి, కృష్ణ, యూసుఫ్, కుర్మయ్య, ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

కాజ్‌వే ధ్వంసం.. ప్రజల ఇబ్బందులు



దుందుభీవాగుపై ధ్వంసమైన కాజ్‌వే

తాడూరు: మండలంలోని సిర్సవాడ గ్రామాన్ని అనుసరించుకొని పారుతున్న దుందుభీవాగుపై ఏర్పాటు చేసిన కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద తాకిడికి బ్రిడ్జి ధ్వంసమైంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నాగర్‌కర్నూల్ జడ్చర్ల కల్వకుర్తి నియోజక వర్గాలకు ప్రధానమైన రహదారి కావడం ప్రతి ఏటా వర్షాల కారణంగా దుందుభీ వాగు నిండుగా ప్రవహించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరైనా టెండర్ల ప్రక్రియ కూడా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న కాజ్‌వే పూర్తిగా పాడయిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు పరిశీలించి బ్రిడ్జినిర్మాణ పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: ప్రతిఒక్కరు చదివిన పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2008–09 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ 17 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు కలుసుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు మల్లయ్య మాతృమూర్తి బాలమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్ లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.